# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం, 24 అక్టోబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## బాణసంచా కర్మాగారంలో పేలుడు



వివరాలు 2లో..

## మమ్మల్ని అరెస్టు చేసినా ఉద్యమం ఆగదు..




వివరాలు 2లో..

## టీవీకే ఎమ్మెల్యేలపై
# స్పీకర్ డెడ్‌లైన్

**అన్నాడీఎంకే నుంచి టీవీకేలో చేరిన నలుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నవంబర్ 17న తుది వాదనలు. విచారణకు కాలపరిమితితో షెడ్యూల్ ఖరారు.**



చెన్నై: తమిళనాడు సీఎం విజయ్ నేతృత్వం లోని టీవీకేలో చేరిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ ముగిం చేం దుకు అసెంబ్లీ స్పీకర్ ఒక గడువును విధిం చారు. ఆ ఎమ్మెల్యే అనర్హత వ్యవహారంపై నవం బర్ 17న తుది వాదనలు జరుగను న్నాయి. అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల అనర్హత విచారణను రెండు నెలల్లోగా ముగించాలని మద్రాస్ హైకోర్టు ఇటీవల స్పీకర్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారి అనర్హత పిటిషన్లపై విచారణ కోసం స్పీకర్ ఒక షెడ్యూల్‌ను ఖరారు చేశారు. పిటిషనర్లు, ప్రతివాదులు తుది ప్రతివాదనలు, సమాధానాలు, పత్రాలను అక్టోబర్ 26న సమర్పించాలి. ఇరుపక్షాలు తమ రుజువు అఫిడవిట్లు లేదా సాక్ష్యాధారాల అఫిడవిట్లను నవంబర్ 2న సమర్పించాలి. ఇరుపక్షాల సాక్షులను వారి తరపు న్యాయవాదుల సమక్షంలో విచారించేందుకు నవంబర్ 10, 11, 12 తేదీలను నిర్ణయించారు. నవంబర్ 17న తుది వాదనలను స్పీకర్ వింటారు. ఆ తర్వాత తీర్పు వెలువడుతుంది. అయితే తుది తీర్పు వెలువడే తేదీని

# తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక కసరత్తు

- 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి సన్నాహాలు
- మహారాష్ట్రతో చర్చలకు సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 23 : ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మహారాష్ట్ర ప్రభుత్వంతో జరగనున్న చర్చలకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, నీటిని తరలించే మార్గాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే కలిగే ప్రయోజనాలు, 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే నీటి లభ్యత ఎలా ఉంటుందనే అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే సుమారు 2,300 ఎకరాలు, 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే వెయ్యి ఎకరాల్లోపు భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని తగ్గిస్తూనే తెలంగాణకు ఎక్కువ నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించినప్పటికీ, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాకపోవచ్చని పేర్కొన్నారు. 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి అంగీకరిం



చేలా సాంకేతిక ఆధారాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

## రాజేంద్రనగర్‌లో మారణాయుధాల కలకలం..



### రూ.4లక్షల విలువ చేసే గంజాయి, పిస్టోళ్లు స్వాధీనం

వివరాలు 3లో..

## నేహాబోరాకు ఢిల్లీ హైకోర్టు షాక్..



- పీస్ బాండ్‌కు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

వివరాలు 2లో..

## పాలమూరు, కాళేశ్వరం పంపులు
# ఎందుకు నడపలేదు?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు




హైదరాబాద్, అక్టోబర్ 23 : తెలంగాణలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణాల కంటే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదులకు భారీగా వరద నీరు వచ్చినప్పటికీ, సాగునీటి ప్రాజెక్టుల పంపులను నడపకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎండిపోతున్న పంటలకు రైతులు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్న దృశ్యాలతో కూడిన వీడియోను ఆయన 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ ఏడాది కృష్ణా నదికి సుమారు 250 టీఎంసీలు, గోదావరి నదికి 750 టీఎంసీల వరద నీరు వచ్చినప్పటికీ పాలమూరు--రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుల పంపులను నడపలేదని కేటీఆర్ ఆరోపించారు. అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుని ఉంటే రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గేవని అభిప్రాయపడ్డారు.

### పంటల కోసం ట్యాంకర్లపై ఆధారం

పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక రైతులు అదనపు ఖర్చులతో ట్యాంకర్ల ద్వారా నీటిని

## క్యూర్ పరిధిలో లక్ష
# ఇందిరమ్మ ఇళ్లు

- మూడు విడతల్లో నిర్మాణాలు.. స్థలాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి




హైదరాబాద్, అక్టోబర్ 23 : హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మూడు విడతల్లో నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. నగరంలో ఉపాధి పొందుతున్న పేదలు తమ పనులకు దూరం కాకుండా, జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా

## ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్**



హైదరాబాద్, అక్టోబర్ 23 : రాబోయే శాసనమండలి ఎన్నికలకు బిఆర్ఎస్ శ్రేణులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజకవర్గంలో ఓటర్ నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు రమేష్ నాయక్ కేటీఆర్ ని కలిసి రాబోయే శాసన మండలి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నామని తెలిపారు.

# బీజేపీతో పొత్తు ఉండొచ్చు..



- ఆప్, కాంగ్రెస్‌లు ప్రత్యర్థులే..
- శిరోమణి అకాలిదళ్ నేత సుఖ్బీర్ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 23 : పంజాబ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశాలున్నాయని శిరోమణి అకాళిదళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడు, మాజీ సీఎం సుఖ్బీర్ సింగ్ బాదల్ వెల్లడించారు. తాము ఎన్డీయేలో చేరొచ్చని తెలిపారు. శుక్రవారం పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతో సుఖ్బీర్ సింగ్ భేటీ అయ్యారు. అనంతరం సుఖ్బీర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ పేరు నేరుగా ప్రస్తావించకపోయినా.. తమ పార్టీ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న వారితో కలిసి పని చేసేందుకు సిద్ధమన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ తమ రాజకీయ ప్రత్యర్థులే అంటూ వ్యాఖ్యానించారు. దీంతో మిగిలి ఉన్నది బీజేపీయే కాబట్టి.. ఆ పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలున్నట్లు పరోక్షంగా ప్రస్తావించారు. గతంలో అకాళిదళ్ పార్టీ ఎన్డీయే కూటమిలోనే ఉండేది. దీంతో ఈసారి కూడా ఆయన అదే కూటమిలో చేరుతారనే ప్రచారం కొంతకాలంగా జరుగుతోంది. పంజాబ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి.

# సర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో మళ్లీ మొదలైన ఆందోళనలు..



## పలువురు అరెస్ట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 23 : సీఈసీకి, సర్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు మళ్లీ మొదలయ్యాయి. కొందరు ఆందోళనకారులు శుక్రవారం సర్‌కు వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సర్ పేరుతో ఓట్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. అయితే, వారిని ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. పలువురు నిరసనకారుల్ని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం జరిగిన ఆందోళనలో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే సహా పలువురు నేతల్ని ఆహ్వానించారు. పలువురు రైతులు, విద్యార్థులు, పౌర సంఘాల ఆధ్వర్యంలో.. ఢిల్లీలోని సాహిబ్ గురుద్వారా బంగ్లా నుంచి పటేల్ చౌక్ సమీపంలోని ఈసీఐ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించాలని భావించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా.. అలాగే, ప్రజా స్వామ్యాన్ని పునరుద్ధరించాలి అనే డిమాండ్‌తో

# ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

- తొలి నెలలోనే 3,885 కాల్స్
- మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీకి ప్రజల నుంచి స్పందన




హైదరాబాద్, అక్టోబర్ 23 : ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 'మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ' కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఈ సేవలు ప్రారంభమైన తొలి నెలలోనే 1100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు 3,885 కాల్స్ వచ్చినట్లు ఎలక్ట్రానిక్ సేవల పంపిణీ కమిషనర్ వెల్లడించారు. సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఆదాయం, కులం, నివాస ధ్రువీకరణ పత్రా లు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు తదితర అవసరాల కోసం కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరిగే ఇబ్బందులను తగ్గించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు, అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ఈ సేవలు ఉపయోగపడ నున్నాయి. 1100కు ఫోన్ చేస్తే సేవల వివరాలు.. ప్రజలు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడంతోపాటు, మీ సేవా పౌరుల పోర్టల్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కోరిన సేవను బట్టి సంబంధిత ప్రతినిధులు ఇంటి వద్దకు వచ్చి సహాయం

# వృద్ధుడికి రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేత



### పజా సేవలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 23 : మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన నేరటి యాదయ్య తండ్రి పెద్దయ్య అనారోగ్య కారణంగా హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన చికిత్స చేయించలేని పరిస్థితిలో ఉన్న వారి కుటుంబాన్ని మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదుకు న్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధికింద రూ.4,00,000(నాలుగు లక్షల రూపాయలు) ఎల్ఓసీ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఎల్ఓసీతో నిమ్స్ ఆసుపత్రిలో పెద్ద య్యకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ఆయ న త్వరగాకోలుకోవాలని ఎమ్మెల్యేఆకాంక్షించారు. పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఆరో గ్య విషయంలో ఎవరూ ఆర్థిక ఇబ్బందులు పడవద్దని, తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సహాయం అందిస్తా నని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే సహాయంతో ఎల్ఓసీ అందడంతో బాధిత సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# శేరి సతీష్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేత



హైదరాబాద్, అక్టోబర్ 23 : కాంగ్రెస్ పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను కొనసాగిస్తానని కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. తనపై విధించిన సస్పెన్షన్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణ చర్యల కమిటీ ఎత్తివేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తన వివరణను పరిశీలించి సస్పెన్షన్‌ను ఎత్తివేసిన పార్టీ నాయకత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్, ఎంపీ డాక్టర్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతుల, డీసీసీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రస్థానానికి పునాది అని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. తనకు అండగా నిలిచిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పదవుల కంటే పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, అధికారం కంటే కాంగ్రెస్ కార్యకర్తల అభిమానమే తన బలమని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణను గౌరవిస్తూ స్థానిక నాయకత్వం, జిల్లా కాంగ్రెస్ కమిటీతో సమన్వయంగా పనిచేస్తానని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని శేరి సతీష్ రెడ్డి వెల్లడించారు.

# బాణసంచా కర్మాగారంలో పేలుడు..





### నలుగురు మృతి

పాట్నా: బాణసంచా కర్మాగారంలో అగ్నిప్రమాదం జరిగింది. ఒక భవనంలో నిల్వ ఉంచిన బాణసంచాకు నిప్పు అంటుకోవడంతో వరుస పేలుళ్లు సంభవించాయి. ఆ సమయంలో పలువురు కార్మికులు లోపల ఉన్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది మరణించినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు నలుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. బీహార్‌లోని సివాన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మహమ్మద్ అమీరుద్దీన్ మియాన్‌కు చెందిన బాణసంచా యూనిట్, నిల్వ ఉంచిన భవనంలో అగ్నిప్రమాదం జరిగింది. నిల్వ ఉంచిన బాణసంచాకు మంటలు వ్యాపించడంతో వరుస పేలుళ్లు సంభవించాయి. పేలుళ్ల తీవ్రతకు బిల్డింగ్ ముందు భాగం కూలిపోయింది. ఆ శిథిలాలు రోడ్డుపై పడ్డాయి. సుమారు రెండు గంటల పాటు పేలుళ్లు కొనసాగాయి. దీంతో చుట్టుపక్కల ప్రాంతంలో నివసించే ప్రజలు భయాందోళన చెందారు. కాగా, అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఆ ఇంట్లో పలువురు ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ ప్రమాదంలో చాలా మంది మరణించి ఉంటారని అనుమానిస్తున్నారు. బాణసంచా పేలుళ్ల తీవ్రత కారణంగా కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైనట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు నలుగురు మరణించినట్లు అధికారులు నిర్ధారించారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ప్రాణనష్టం, అధికారుల చర్యల వివరాలు తెలియాల్సి ఉన్నది.

# నారాయణపేటలో కొట్టుకున్న బీఎస్పీ–కాంగ్రెస్ నాయకులు

నారాయణపేట : నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎన్.హెచ్.ఎం శిబిరం వద్ద బీఎస్పీ- కాంగ్రెస్ నాయకుల మధ్య మాట మాట పెరిగి చేయిచేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోధిగేల శ్రీనివాస్ -- కాంగ్రెస్ నాయకుడు బండి వేణు వర్గీయుల మధ్య ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు చెయ్యి చేసుకోవ డంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు



సంఘటన స్థలానికి ఇరువర్గాలను సముదాయించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

# రక్తదానం - ప్రాణదానం: పోలీసుల సేవా దృక్పథం శ్లాఘనీయం..!

- పాలకుర్తిలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ రక్తదాన శిబిరం
- శిబిరాన్ని ప్రారంభించిన డీసీపీ రాజమహేంద్ర నాయక్
- వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేసిన యువత, పోలీసులు



పాలకుర్తి–అక్టోబర్ 23
సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సంస్మరణార్థం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రాణదాతలుగా నిలవడం పోలీసుల సేవా దృక్పథానికి నిదర్శనమని డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్సారత్ గార్డెన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో గురువారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీసీపీ రాజమహేంద్ర నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు.

**అమరవీరుల స్ఫూర్తితోనే శాంతిభద్రతలు:**

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణాలను సైతం పణంగా పెట్టిన అమరవీరుల స్ఫూర్తితోనే నేడు సమాజం ప్రశాంతంగా ఉందన్నారు. వారి జ్ఞాపకార్థం రక్తదానం వంటి పవిత్రమైన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్యను, పాలకుర్తి పోలీసులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**వెల్లువెత్తిన స్పందన.. భారీగా తరలివచ్చిన యువత:**

వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ రక్తదాన శిబిరానికి అంచనాలకు మించి స్పందన లభించింది. పాలకుర్తి, దేవరుప్పుల మండలాల నుండి పోలీసులు, యువకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా రక్తదా నం చేశారు. రక్తదాతలకు పోలీసులు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ సామాజిక సేవా కార్యక్రమంలో పాలకుర్తి సీఐ భరత్ సుమన్, పాలకుర్తి దేవరుప్పుల సృజన్ కుమార్, చింత రాజు, తిరుమలగిరి ఎంఆర్ఓ హరిప్రసాద్, పాలకుర్తి సర్పం చ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది మరియు యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మమ్మల్ని అరెస్టు చేసినా ఉద్యమం ఆగదు..

- సౌరవ్ దాస్, రాంకా వెల్లడి.. క్రైమ్ బ్రాంచ్ ఎదుట హాజరు




న్యూఢిల్లీ, అక్టోబర్ 23 : తమను అరెస్టు చేసినా సీజేపీ చేపట్టిన ఉద్యమం ఆగబోదని ఆ పార్టీ అగ్రనేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లు అన్నారు. తమ నేతలు ఎవరిని అరెస్టు చేసినా ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లు శుక్రవారం ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. అక్టోబర్ 13న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించడం వంటి అంశాలపై పోలీసులు ఇద్దరికీ బుధవారం సమన్లు జారీ చేశారు. ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ ఎదుట విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. దీంతో రాంకా, దాస్ శుక్రవారం విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. నాయకులు అరెస్టైతే ఉద్యమం ఎలా కొనసాగిస్తారు అంటూ మీడియా ప్రశ్నించగా.. తమను అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. తమ అరెస్టుల వల్ల తమ గురించి మరింతగా తెలుసుకునేందుకు అవకాశం దొరికందన్నారు. అలాగే, వ్యవస్థలు ఎలా పని చేస్తాయో కూడా అర్థమైందన్నారు. తాము నాయకులం కాదని, దేశ ప్రజలు తమకు అందించిన వ్యవస్థకు సంరక్షకులం మాత్రమే అన్నారు. తమ వల్ల అయినంత మంచి చేయాలనేదే తమ తాపత్రయమని వివరించారు. తాముకానీ, తమ పార్టీ నేతలు కానీ జైలులో ఉన్నా.. బయట ఉన్నా ఉద్యమం మాత్రం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఈసీ రాజీనామా కోరుతూ సీజేపీ చేపట్టిన ఆందోళన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో అక్టోబర్ 13న రాంకా, దాస్‌లను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వారికి కోర్టు జుడీషియల్ కస్టడీ విధించడంతో వారం రోజులకుపైగా తిహార్ జైలులో ఉన్నారు. గత బుధవారం వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అదే రోజు ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఇద్దరికీ మళ్లీ వేరే కేసులో నోటీసులు జారీ చేశారు.

# నేహాబోరాకు ఢిల్లీ హై కోర్టు షాక్..

- పీస్ బాండ్‌కు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ, అక్టోబర్ 23 : ఏఐఎస్ఏ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్) ప్రెసిడెంట్ నేహాబోరాకు ఢిల్లీ హై కోర్టు షాకిచ్చింది. రూ.10,000 విలువైన పీస్ బాండ్ సమర్పించాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ నేహా బోరా దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హై కోర్టు శుక్రవారం కొట్టివేసింది. సీఈసీకి వ్యతిరేకంగా సీజేపీ చేపట్టిన ఆందోళనల్లో నేహాబోరా పాల్గొన్నారు. అనుమతి లేకుండా ఆందోళన సందర్భంగా జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా జంతర్ మంతర్ వైపు దూసుకెళ్లడం, శాంతి భద్రతలకు భంగం కలిగించడం వంటి నేరాలపై గత వారం ఆమెను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మరుసటి రోజు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆమె జైలు నుంచి నేహా బోరా విడుదలైంది. ఈ సందర్భంగా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కీలక ఆదేశాలు జారీ చేశారు. స్థానిక మెజిస్ట్రేట్ ముందు హాజరై, రూ.10,000 విలువైన పీస్ బాండ్‌పై సంతకం చేయాలని ఆదేశించారు. అయితే, తాను ఏ శాంతి ఒప్పందంపై సంతకం చేయాల్సిన అవసరం లేదని, తనకు నిరసన తెలిపే హక్కు ఉందని నేహా బోరా వ్యాఖ్యానించింది. పీస్ బాండ్‌పై సంతకం చేయాలంటూ ఎస్ఈఎం ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఢిల్లీ పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు నేహా బోరా పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే, కోర్టు ఆదేశాలకు సంబంధించిన తుది కాపీ వెలువడాల్సి ఉంది. కోర్టు వ్యాఖ్యలకు అనుగుణంగా నేహా బోరా ఉన్నత స్థాయి కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది.

# 'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీని వ్యతిరేకిస్తున్నాం'

## బీసీ-ఏ కులాల ఐక్యవేదిక



నల్లగొండ రూరల్, అక్టోబర్ 23 : ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుండి బీసీ-ఏలోకి మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వ్యతిరేకిస్తున్నట్లు బీసీ-ఏ కులాల ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రవీంద్రభారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకల సందర్భంగా ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే బీసీ-ఏ వర్గాలకు అమలవుతున్న 7 శాతం రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లకు అదనపు రిజర్వేషన్లు కల్పించాలనుకుంటే బీసీ-ఏకు వేరుగా ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలను న్యాయస్థానాలు కొట్టివేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అమలు సాధ్యం కాని హామీలతో బీసీ కులాల మధ్య విభేదాలు సృష్టించవద్దని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కంది సూర్యనారాయణ, సింగం రాంమోహన్, లకడాపురం వెంకటేశ్వర్లు, నేలపట్ల సత్యనారాయణ, గుండు వెంకటే శ్వర్లు, యలిజాల వెంకన్న, తడం సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

# నీళ్లులేక ఎండిన పంటలు..



**● జయశంకర్ జిల్లాలో యువరైతు వినూత్న నిరసన :**

జయశంకర్ భూపాలపల్లి : కాంగ్రెస్ తెచ్చిన కరువుతో రాష్ట్రంలో రైతులు అల్లాడిపోతున్నారు. నీళ్లులేక, కరెంట్ రాక పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా పంటలు ఎండిపోతుండటంతో ఆగ్రహించిన అన్నదాతలు వినూత్న పద్ధతుల్లో తమ నిరసన తెలియజేస్తున్నారు. తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓ యువరైతు వినూత్న నిరసన తెలిపారు.గణపురం మండలం గొల్లపల్లిలో తన 3 ఎకరాల పొలంలో వరి పంట నీళ్లు లేక, కరెంటు రాక ఎండిపోవడంతో తన ద్విచక్ర వాహనంతో పొలంలో తిరుగుతూ ప్రవీణ్ అనే యువ రైతు నిరసన తెలిపాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు సాగునీరు లేక, కరెంటు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. లేదంటే ఆత్మహత్యే శరణ్యం అంటూ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

# పారిశ్రామికవాడలో గ్యాస్ లీక్



## ఇద్దరు కార్మికులు మృతి

హైదరాబాద్, అక్టోబర్ 23 : సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో విషాదం చోటుచేసుకుంది. సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తెల్లవారుజామున పరిశ్రమలోని గ్లాబా బ్లాక్‌లో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో సుదర్శన్ రావు (27), బాలాజీ (44) అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. వీరిద్దరూ ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన కార్మికులుగా సమాచారం. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్యాస్ లీక్‌కు గల కారణాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నేడు మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం..



**● బరాజ్‌ను పరిశీలించనున్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు**

హైదరాబాద్, అక్టోబర్ 23 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని మేడిగడ్డ బరాజ్ వద్దకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం శనివారం వెళ్లనున్నది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు ఉదయమే హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లనున్నారు. తొలుత ఘట్‌కేసర్ వద్ద సమావేశమై అకడి నుంచి ఉమ్మడిగా వెళ్తారు. మార్గమధ్యంలో వరంగల్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో అల్పాహారం తీసుకోనున్నారు. అక్కడి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు కూడా ఈ బృందంతో కలిసి మేడిగడ్డకు బయలుదేరి వెళ్తారు. ఉదయం 10.30 గంటలకే మేడిగడ్డకు చేరుకొని బరాజ్‌ను సందర్శించనున్నారు.

# రఘునందన్ కృషి స్ఫూర్తిదాయకం..



**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 23 : చిన్న వయసులోనే సామాజిక బాధ్యతను గుర్తించి, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన దుగ్గిదేవర శ్రీరఘునందన్‌ను బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. రఘునందన్ సేవ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. రఘునందన్‌కు తన ఆశీస్సులు, ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను రఘునందన్ కలిశారు. సొంతూరులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పదేండ్లుగా చేస్తున్న కృషిని వివరించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యతా లోపాలు

**● రైతులకు నీరందించలేని దుస్థితి.. బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ నేత విమర్శలు**

**● టీపీసీసీ కార్యదర్శి, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి**

హైదరాబాద్, అక్టోబర్ 23 : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, నాణ్యతా లోపాల కారణంగానే ఆశించిన స్థాయిలో నీటిని నిల్వ చేసి వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.ప్రజాధనంతో భారీ ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పిన గత పాలకులు, నేడు రైతులు నీరు, విద్యుత్తు కోసం ఇబ్బందులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**రైతుల సమస్యలపై రాజకీయాలా?**



రైతుల కష్టాలకు కారణమైన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు వారిని పరామర్శించడం విడ్డూరంగా ఉందని యాదగిరి విమర్శించారు. రైతుల సమస్యలపై మొసలి కన్నీరు కార్చడం మానుకుని, గతంలో చేసిన తప్పులకు బాధ్యత వహించాలని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యతా ప్రమాణాలు, ప్రజాధనం వినియోగంపై సమగ్ర సమీక్ష జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా పరిష్కారానికి కృషి చేయాలని దేవులపల్లి యాదగిరి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు ఆరెపల్లి సురేశ్ పాల్గొన్నారు.

# ఏపీలో మాజీ మంత్రిపై పోలీసుల దౌర్జన్యం..

**చిలకలూరిపేటలో తీవ్ర ఉద్రిక్తత**



హైదరాబాద్, అక్టోబర్ 23 : ఏపీలో స్థానిక సంస్థల నామినేషన్లు కొద్ది రోజులుగా యుద్ధాన్ని తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ఎక్కడికక్కడ బలవంతంగా అడ్డుకుంటున్నారు. తాజాగా చిలకలూరిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ మంత్రి విడదల రజినీని పోలీసులు కింద పడేశారు. గత మూడు రోజులుగా ఆమెను పోలీసులు గృహనిర్బంధం చేశారు. నేడు ఆమెపై పోలీసుల దౌర్జన్యం చేయడం స్థానికంగా కలకలం రేపింది. రజినీని కలిసేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎవరూ రాకుండా పోలీసులు తీవ్ర ఆంక్షలు విధించారు. ఇదే సమయంలో ఎడ్లపాడు జెడ్పీటీసీ అభ్యర్థి పందుల బుల్లబ్బాయిని నామినేషన్ దాఖలు చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలోనే తనను కలిసేందుకు వచ్చిన బుల్లబ్బాయిని పరామర్శించేందుకు ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ ప్రియాంక మాజీ మంత్రిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగగా, ఎస్ఐ ప్రియాంక విడదల రజినీపై దౌర్జన్యానికి దిగారు. తోసేయడంతో ఆమె కింద పడిపోయారు. మాజీ మంత్రి ఇంట్లోనే పోలీసుల దౌర్జన్యపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# పోలీసుల సమక్షంలోనే వైద్యురాలిపై దాడి..



**ఆమె చెంపపై కొట్టిన వ్యక్తి**

ముంబై: ఒక కేసులో నిందితుడైన వ్యక్తిని వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తీసుకెళ్లారు. అయితే వైద్య పరీక్షల తర్వాత ఆ వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. వైద్యురాలి చెంపపై అతడు కొట్టాడు. అప్రమత్తమైన పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకుని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం సాయంత్రం తలేగావ్ శ్యామ్‌జీపంత్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక వ్యక్తిని పోలీసులు తీసుకువచ్చారు. మెడికో లీగల్ కేసులో నిందితుడైన అతడికి వైద్య పరీక్షలు చేయించారు.కాగా, వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత సంబంధిత పత్రంపై వైద్యురాలు సంతకం చేశారు. నిందితుడైన ఆ వ్యక్తి కూడా ఆ పత్రంపై సంతకం చేశాడు. ఆ తర్వాత పోలీసులు పక్కనే ఉన్నప్పటికీ వైద్యురాలి చెంపపై అతడు కొట్టాడు. వెంటనే స్పందించిన ఒక పోలీస్, ఆ వ్యక్తిని పట్టుకుని ఆ రూమ్ నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి ఆ వ్యక్తిపై మరో కేసు నమోదు చేశారు. ఒక మహిళపై బ్లేడుతో దాడి చేసిన కేసులో అతడు నిందితుడని పోలీస్ అధికారి తెలిపారు. అయితే వైద్యురాలిపై ఆ వ్యక్తి ఎందుకు దాడి చేశాడో అన్నది తెలియలేదు. ఆ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది ఈ సంఘటనను ఖండించారు. నిరసనగా కొంతసేపు వైద్య సేవలను నిలిపివేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# రాజేంద్రనగర్‌లో మారణాయుధాల కలకలం..

**రూ.4లక్షల విలువ చేసే గంజాయి, పిస్టోళ్లు స్వాధీనం**



హైదరాబాద్, అక్టోబర్ 23 : గంజాయి, మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ ఎక్సైజ్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వివరాలను వెల్లడించారు.అత్తాపూర్ లోని సిక్‌చనీ ప్రాంతానికి చెందిన సర్దార్ రాజాసింగ్ లోన్ రికవరీ ఏజెంట్. గతేడాది నుంచి స్థానికంగా గంజాయి, పాప్పిస్ట్రా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ చీ ఓ నజీర్ పాషా, ధూల్పేట ఎసచీ ప్రవీణ్ కుమార్ తమ బృందాలతో సంయుక్తంగా కలిసి రాజాసింగ్ నివాసంపై దాడులు చేశారు. నిందితుడి వద్ద గంజాయి, పాప్పిస్ట్రా మత్తు పదార్థాలతో పాటు మారణాయుధాలు లభించాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా ధూల్‌పేటలోని మంగళటక్‌కు చెందిన రాహుల్సింగ్ వద్ద నుంచి గంజాయిని, నాందేడ్‌లో ఓ వ్యక్తి నుంచి పాప్పిస్ట్రా మత్తు పదార్థాన్ని కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు.అయితే మారణాయుధాలు తన తండ్రి నుంచి వచ్చినట్లుగా నిందితుడు వెల్లడించినట్లు డీసీ వివరించారు. ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రూ.4లక్షల విలువ చేసే 1.5 కిలోల ఎండు గంజాయి, 1.13కిలోల పాప్పిస్ట్రా, ఒక తుపాకీ, రెండు పిస్టోళు, ఐదు రౌండ్ల తూటాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ డీసీ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ దాడుల్లో రాజేంద్రనగర్ ఎసాచీ నజీర్ పాషా, ధూల్పేట ఎస్‌హెచ్ ఓ ప్రవీణ్ కుమార్, సీఐలు విప్లవరెడ్డి, వెంకన్న, విజయ్, సిబ్బంది జనార్ధన్, ప్రసాదావు, సాబేర్, నాగరాజు, సూర్య, రాజేశ్, లేఖ సింగ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సూరారం పీఎస్ పరిధిలో.. నీళ్ల బకెట్‌లో పడి చిన్నారి మృతి



హైదరాబాద్, అక్టోబర్ 23 : నీళ్ల బకెట్‌లో పడి ఏడాదిన్నర వయస్సు గల చిన్నారి మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన సురారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాండు బస్తీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీహార్ రాష్ట్రానికి చెందిన పప్పూ రవిదాస్(45) కూలీ పనులు చేసుకుంటూ ప్రస్తుతం పాండు బస్తీలో నివాసం ఉంటున్నాడు. ఇతనితో పాటు ఇతని కుమార్తె రాణీ దేవి కుమార్తె ఏడాదిన్నర వయసున్న దివాంశి కుమారి కూడా ఇక్కడే నివసిస్తోంది. చిన్నారి తల్లి బీహార్‌లో ఉంటుండగా పప్పూ రవిదాస్ కుమార్తె చాందిని కుమారి చిన్నారిని ఇంటి వద్ద చూసుకుంటోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చిన్నారి నీళ్ల బకెట్‌లో పడి చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**● బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ డిమాండ్**

**● ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ధర్నాకు సంఘీభావం**



హైదరాబాద్, అక్టోబర్ 23 : ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ కింద 17,500 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. గత 11 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నారని గుర్తుచేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందని అన్నారు. మూడేండ్లు అయినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆరోగ్యరంగాన్ని బలోపేతం చేసే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆరోగ్యానికి భద్రత లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు.కరోనా విపత్తు సమయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ముందుండి సేవలు అందించారని గుర్తుచేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ఓట్లు అడుగుతున్న కాంగ్రెస్ నేతలను తమ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిలదీయాలని క్రిశాంక్ పిలుపునిచ్చారు. మూడు టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను నాడు బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించి ఆరోగ్యరంగానికి పెద్దపీట వేసినట్టు తెలిపారు. ప్రభుత్వ దవాఖానలను పక్కన బెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి వాళ్ల కుటుంబసభ్యులు నడిపిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ మీద ప్రేమ చూపిస్తున్నారని చురకలు అంటించారు. ఆరోగ్యశాఖ మంత్రి, హెల్త్ సెక్రటరీ, ఫ్యామిలీ అండ్ హెల్త్ వెల్ఫేర్ కమిషనర్ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ డాక్టర్ మహేందర్‌రావు పుట్ట, ఆయా క్యాడర్ల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# (మొదటిపేజీ తరువాయి)

## టీవీకే ఎమ్మెల్యేలపై స్పీకర్ డెడ్‌లైన్

ఈ షెడ్యూల్‌లోకాగా, సీఎం విజయ్ ప్రభుత్వం బలపరీక్ష సందర్భంగా 25 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పార్టీ విప్‌ను ధిక్కరించారు. మైనారిటీ టీవీకే ప్రభుత్వానికి అనుకూలంగా వారు ఓటు వేశారు. అయితే వీరిలో 19 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అనంతరం పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. దీంతో వారిపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను ఆ పార్టీ ఉపసంహరించుకున్నది. మిగిలిన ఆరుగురు అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి అధికార టీవీకేలో చేరారు.అయితే అనర్హత పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదించారు. అన్నాడీఎంకే దీనిపై మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. మరో ఇద్దరు రెబల్ ఎమ్మెల్యేలైన డాక్టర్ ఆర్ విజయభాస్కర్, ఎం ఆర్ విజయభాస్కర్‌లకు కూడా సాంకేతికంగా పార్టీ నుంచి క్షమాభిక్ష లభించింది. అయినప్పటికీ వారిద్దరూ పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆరుగురు ఎమ్మెల్యేలలో నలుగురిపై మాత్రమే స్పీకర్ విచారణ జరుపవచ్చని తెలుస్తున్నది.

## తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక కసరత్తు

### ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన వెంటనే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే మార్గాలు, కాల్వలు, భూసేకరణపై కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు అవసరమైన నీటిని సమకూర్చే అంశంపైనా సీఎం సమీక్షించారు. డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట పథకానికి 0.1 టీఎంసీల నీటిని అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే మార్గాలను పరిశీలించాలని ఆదేశించారు.నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు నీటిని తరలించే మార్గాలు, పంపుహౌస్‌ల ఏర్పాటు, కాల్వల సామర్థ్యం, అంచనా వ్యయాలపై అధ్యయనం చేయాలని సూచించారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఎలాంటి ఆటంకం కలగకుండా డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు.ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాలమూరు, కాళేశ్వరం పంపులు ఎందుకు నడపలేదు?

తెచ్చుకుంటున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులు నీటి కోసం ఇబ్బందులు పడటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.కరవు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఎండిపోతున్న పంటలకు నీరందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి పంపిణీపై సమగ్ర ప్రణాళిక రూపొందించి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి లభ్యతపై ప్రభుత్వం వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

## క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు

నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ టవర్ల నిర్మాణం, స్థలాల గుర్తింపు, లబ్ధిదారుల ఎంపికపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి సుమారు 500 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. రెండో, మూడో విడతలకు అవసరమైన భూములను కూడా ముందుగానే గుర్తించి, పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఆన్‌లైన్ డ్రా ద్వారా అర్హులను ఎంపిక చేస్తున్నామని, ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయడంతోపాటు యూట్యూబ్‌లోనూ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టి, పేదల గృహ నిర్మాణాలకు అవసరమైన భూములను పరిరక్షించాలని కలెక్టర్లకు సూచించారు. అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## బీజేపీతో పొత్తు ఉండొచ్చు..

ఈ నేపథ్యంలో బీజేపీతో పొత్తు పెట్టుకుని, అధికారం దక్కించుకోవాలని బాదల్ భావిస్తున్నారు. కొన్నేళ్లుగా ఎన్‌డీయేకు దూరంగా ఉన్న ఆయన ఇటీవల ఆ కూటమికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.గత ఆగస్టులో ఆయన ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. అప్పుడే ఆయన ఎన్‌డీయే వైపు చేరడం ఖాయమైందనే ప్రచారం జరిగింది. తాజాగా ఆప్, కాంగ్రెస్ పార్టీలు తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థులు అని ప్రకటించడం.. తమ సిద్ధాంతాలకు దగ్గరగా ఉండేవారితో పొత్తు పెట్టుకుంటాం అని చెప్పడం ద్వారా బీజేపీతో పొత్తుపై ప్రకటన చేసినట్లు అర్థమవుతోంది.

## సర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో మళ్లీ మొదలైన ఆందోళనలు..

ఈ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆందోళనకారులు.. హర్ గలి జంతర్ మంతర్.. హర్ గావో జంతర్ మంతర్.. మేరా ఘర్ జంతర్ మంతర్ అంటూ నినదించారు.అయితే, ఆందోళనకారుల్ని ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. మరోవైపు ఢిల్లీలో ఆందోళనల్ని అదుపు చేసేందుకు కేంద్ర హోం శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే భారీ స్థాయిలో పోలీసులు, ఇతర భద్రతా బలగాల్ని మోహరించిన కేంద్రం.. ఇప్పుడు అదనంగా 273 సీఏపీఎఫ్ కంపెనీలను రంగంలోకి దించింది. అక్టోబర్ 31 వరకు వీరు ఢిల్లీలో సేవలందిస్తారు. ఈ నెల ప్రారంభం నుంచి వీరు ఇక్కడ పని చేస్తున్నారు. ముందుగా అక్టోబర్ 20 వరకే సీఏపీఎఫ్ బలగాల్ని ఉంచాలని భావించారు. కానీ, ప్రస్తుత పరిస్తితుల దృష్ట్యా అక్టోబర్ 30 వరకు ఈ బలగాల్ని మోహరించనున్నారు.



## ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

అందిస్తారు. సేవల వారీగా అవసరమైన పత్రాలు, రుసుములు, నిబంధనలు మారే అవకాశం ఉన్నందున దరఖాస్తు చేసే ముందు వివరాలు తెలుసు కోవాలి. ప్రస్తుతం ఈ సేవలు పరిమిత ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. తమ ప్రాంతంలో ఈ సదుపాయం ఉందో లేదో ముందుగా నిర్ధారించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో సేవలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించి, ప్రజలకు వేగంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందిస్తే ఈ కార్యక్రమం మరింత ప్రయోజనకరంగా మారనుంది.

# ఎల్‌నినో దెబ్బ, కరువు ముప్పు..

### పేదలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్!




**హైదరాబాద్, అక్టోబర్ 23 :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తిన తీవ్ర నీటి ఎద్దడి, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కారు కార్యాచరణ సిద్ధం చేసింది. రాబోయే 8 నుంచి 10 నెలల పాటు రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పేద కూలీలను ఆదుకునేందుకు సంక్రాంతి పండుగ తర్వాత మే నెల వరకు ఉద్దేశించిన ఓ కొత్త ప్రత్యేక పథకాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రజా భవన్లో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నాయకులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

### రైతులు వర్షాధార పంటలే వేయాలి

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు వాటి మొత్తం సామర్థ్యంలో 20 శాతం కంటే తక్కువకు పడిపోయాయని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీరు 200 టీఎంసీలకు మించి లేదని, కొన్ని జలాశయాలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లలో ఇప్పటికే 15 లక్షలు ఎండిపోయాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో సాగునీరు అందించడం అసాధ్యమని, అందువల్ల ప్రాధాన్యత ప్రకారం తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యం ఇస్తామని సీఎం స్పష్టం చేశారు. రైతులు ఈ పరిస్థితులను అర్థం చేసుకుని, నీటి అవసరం తక్కువగా ఉండే వర్షాధార పంటలు, కూరగాయలను మాత్రమే సాగు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ రైతు వేదిక ద్వారా కరువు పరిస్థితులపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు.పేద కూలీలు, కార్మికులకు కష్టకాలంలో ఉపాధి కల్పించేందుకు కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర సర్కారు భారీగా నిధులు వెచ్చించి సంక్రాంతి నుంచి మే నెల వరకు 4 నెలల పాటు ప్రత్యేక పథకాన్న అమలు చేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం ద్వారా కాలువలు, చెరువులు, కుంటల పూడికతీతతో పాటు పొలాలకు వెళ్లే బాటలను పునరుద్ధరిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పశు గ్రాసం, తాగునీటి ఎద్దడి రాకుండా పశువుల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తామని.. ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను పెంచుతామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు గ్రామాలు సందర్శించి ఈ పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తామని తెలిపారు.రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు, ఎండ తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో 20,000 మెగావాట్లకు చేరుకుంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల ఏర్పడిన విద్యుత్ కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ.. మార్కెట్లో విద్యుత్ లభ్యత లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందనన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను బొగ్గు లభ్యత ఉండే రామగుండం, కొత్తగూడెం కాకుండా దామరచర్లలో నిర్మించడం వల్ల రూ.8,000 కోట్లకు పైగా అదనపు భారం పడిందని, రవాణా ఖర్చులు పెరిగాయని మండిపడ్డారు. ప్రతిపాదిత ప్రాంతంలో ప్రాజెక్టు పెట్టడం వెనుక కేసీఆర్ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఓటర్ల తొలగింపు సహా ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఆరోపించిన సీఎం రేవంత్ రెడ్డి.. నవంబర్ 1న ఢిల్లీలో రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించే భారీ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ నుంచి 15,000 మంది పార్టీ కార్యకర్తలను సమీకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిలను గెలిపించేందుకు పార్టీ యంత్రాంగం శ్రమించాలని, అర్హులైన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంపై కీలక ఆదేశాలిచ్చిన మంత్రి పొంగులేటి!



**హైదరాబాద్, అక్టోబర్ 23 :** తెలంగాణలో పేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో మరో కీలక అడుగు పడింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన భూములు గుర్తించాలని స్పష్టంగా ఆదేశించారు. క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడతతో పాటు రెండో, మూడో విడతల నిర్మాణాలకు కూడా అవసరమైన భూములను వెంటనే గుర్తించాలని మంత్రి సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, ఎంపికను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని కూడా చెప్పారు. దీనివల్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇందిరమ్మ టవర్స్ నగరం లోపలే, లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు దగ్గరగా నిర్మించబడుతున్నాయి. గతంలో పేదలకు దూర ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించే పద్ధతిని మార్చి, ఉపాధి అవకాశాలు దెబ్బతినకుండా నగరంలోనే సౌకర్యవంతమైన ఫ్లాట్లు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి ఫ్లాట్‌కు లబ్ధిదారులకు పూర్తి హక్కులు, భూమి వాటా కల్పించి, రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా సేల్ డీడ్ అందించనున్నారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి సుమారు 500 ఇళ్లు నిర్మించే ప్రణాళిక ఉంది. కొన్ని చోట్ల ఇప్పటికే శంకుస్థాపనలు జరిగాయి. నాంపల్లి, రాయదుర్గ్, పోచారం వంటి ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఒక్కో ఫ్లాట్‌కు సబ్సిడీ అందిస్తుండగా, లబ్ధిదారులు కొంత మొత్తం వాయిదాల వారీగా చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాల్లో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల పథకం వేగంగా సాగుతోంది. మంత్రి పొంగులేటి సమీక్షలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కూడా చర్చ జరిగింది. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఉండకూడదని, అర్హత మాత్రమే ప్రమాణంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. భూముల గుర్తింపు, ఎంపిక ప్రక్రియ వేగంగా పూర్తయితే నిర్మాణాలు మరింత వేగవంతం అవుతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# చైనా దుస్సాహసంపై భారత్ వార్నింగ్..!

### గీత దాటాలనుకుంటే ఇక..!

**న్యూఢిల్లీ, అక్టోబర్ 23 :**అరుణాచల్ ప్రదేశ్ సమీపంలోని వాస్తవాధీన రేఖ వద్ద చైనా బలగాలు, భారత సైనికులతో నిత్యం ఘర్షణలకు దిగుతున్నట్లు ఇవాళ ఇండో టిబెటన్ బోర్డర్ ఫోర్స్ (ఙదీృ) డీజీ చేసిన ప్రకటనతో ఒక్కసారిగా కలకలం రేగింది. సరిహద్దుల్లో ఇంత జరుగుతుంటే మోడీ సర్కార్ మౌనంగా ఉండిపోవడం ఏంటని విపక్షాలు ప్రశ్నించాయి. దీంతో విదేశాంగశాఖ సాయంత్రానికి ఈ వ్యవహారంపై ఓ ప్రకటన చేసింది. అందులో చైనా చర్యల్ని తప్పుబడుతూనే డ్రాగన్ కంట్రీకి కీలక హెచ్చరికలు చేసింది. ఇవాళ జరిగిన వారాంతపు మీడియా సమావేశంలో భారత్-చైనా సరిహద్దు ఘర్షణలపై (×అనఋఖు-జష్ట్రఋఋఖు దీశీతీసవతీ ౌవఅంఊశీఅం) విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్ ధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. చైనా సైనికులు నిర్దేశిత పెట్రోలింగ్ విధానాల నుంచి వైదొలిగినప్పుడు భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో అప్పుడప్పుడు పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయని పేర్కొన్నారు. భారత్-చైనా సరిహద్దు సమస్యలను పరిష్కరించేందుకు ఇరు దేశాలు ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక వ్యవస్థల ద్వారా చర్చలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. వాస్తవాధీన రేఖ వెంబడి అపార్థాలు, తప్పుడు అంచనాలు ఏర్పడకుండా చూసుకోవడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మెరుగైన సరిహద్దు నిర్వహణ కోసం, అవసరమైన ప్రాంతాల్లో వాస్తవాధీన రేఖపై పరస్పర అవగాహన పెంచుకునే మార్గాలపై చర్చించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని తెలిపారు.భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర అభివృద్ధికి అత్యంత అవసరమని విదేశాంగ శాఖ హెచ్చరించింది. మరోవైపు ప్రధాన విపక్షం కాంగ్రెస్ ఈ వ్యవహారంపై మోడీ సర్కార్ తక్షణం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, చైనాకు పదేపదే క్లీన్‌చిట్‌లు ఇవ్వడం ఇక చాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని కోరారు. నెల రోజుల క్రితమే ఇరు దేశాల మధ్య చర్చలు జరగడం, బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ హాజరైన నేపథ్యంలో తాజా పరిణామాలపై మరింత దూకుడుగా స్పందించేందుకు కేంద్రం సిద్దంగా లేనట్లు తెలుస్తోంది.




# పడిపోయిన హైదరాబాద్ స్థానం : ఆక్స్‌ఫర్డ్ రిపోర్ట్‌లో షాకింగ్ విషయాలు!

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** గ్లోబల్ సిటీగా శరవేగంగా ఎదుగుతున్న హైదరాబాద్ నగర జీవన నాణ్యతపై కీలక గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. 'ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్ 2026' నివేదికలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 1,000 ప్రధాన నగరాల్లో హైదరాబాద్ 421వ స్థానానికి పడిపోయింది. దేశంలోని మహానగరాలైన ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నైలతో పోలిస్తే హైదరాబాద్ వెనుకబడిపోవడం గమనార్హం. ఆర్థిక పురోగతి, హ్యూమన్ క్యాపిటల్ విభాగాల్లో అగ్రగామిగా నిలిచినప్పటికీ.. జీవన ప్రమాణాలు, పర్యావరణ విభాగాల్లో పేలవమైన ప్రదర్శన కనబరిచింది. జీవన నాణ్యతలో 818వ స్థానం ఆర్థిక దృఢత్వంలో 248వ స్థానం, హ్యూమన్ క్యాపిటల్ విభాగంలో 241వ స్థానంతో హైదరాబాద్ ప్రతిభ చాటింది. బలమైన ఉపాధి అవకాశాలు, ఐటీ కాస్మోపాలిటన్ సంస్కృతి, విశ్వవిద్యాలయాలు, నైపుణ్యమున్న యువత హైదరాబాద్ ప్లస్ పాయింట్లుగా నిలిచాయి. అయితే ఈ పురోగతి స్థానిక నివాసితుల ప్రాథమిక జీవన ప్రమాణాలను మెరుగుపరడడంలో విఫలమైంది. ఆదాయ అసమానతలు, విపరీతంగా పెరిగిన ఇళ్ల అద్దెలు, వైద్య సదుపాయాలు, నేరాల రేటు, వినోద రంగాలు ప్రాతిపదికగా లెక్కించిన 'క్వాలిటీ ఆఫ్ లైఫ్' విభాగంలో హైదరాబాద్ ఏకంగా 818వ స్థానానికి దిగజారింది. మరోవైపు పర్యావరణ విభాగంలో హైదరాబాద్ 657వ స్థానంలో నిలిచింది. ముంబై(782), ఢిల్లీ(915) కంటే మెరుగ్గా ఉన్నప్పటికీ.. బెంగళూరు(528) కంటే వెనుకబడే ఉంది. గాలి కాలుష్యం పెరగడం, కార్బన్ ఉద్గారాలు, వాతావరణంలో సంభవిస్తున్న ఆకస్మిక మార్పులు, అస్తవ్యస్తంగా మారుతున్న ట్రాఫిక్ వ్యవస్థ నగర వాసులకు శాపంగా మారుతున్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.

కేవలం ఆర్థికంగా ఎదగడమే కాకుండా.. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా మౌలిక సదుపాయాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని నగర ప్లానర్లు అభిప్రాయపడుతున్నారు.

ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, రోడ్ల పరిస్థితిని సీరియస్‌గా తీసుకోవడం, ప్రజా రవాణాను బలోపేతం చేసి సొంత వాహనాల వాడకాన్ని తగ్గించడం ద్వారా మాత్రమే కాలుష్యాన్ని అదుపు చేసి 'క్వాలిటీ ఆఫ్ లైఫ్' ర్యాంకింగ్స్‌ను మెరుగుపరచుకోవచ్చని వారు సూచిస్తున్నారు. ఆర్థిక పురోగతిని, ఆరోగ్యకరమైన జీవన నాణ్యతతో సమతుల్యం చేసుకోవడమే హైదరాబాద్ ముందున్న ప్రధాన లక్ష్యం

# క్రిస్టియన్ ఫైనాన్స్ పథకం లబ్ధిదారుల ఎంపిక

- చిన్న వ్యాపారానికి ఇద్దరు..
- ఈ-స్కూటర్, ఈ-బైక్‌లకు ఎనిమిది మంది ఎంపిక



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఆర్థిక సహాయ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా స్థాయి ఎంపిక, పర్యవేక్షణ కమిటీ సమక్షంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు.ఈ పథకం కింద చిన్న వ్యాపారాల ఏర్పాటుతోపాటు ఈ-స్కూటర్, ఈ-బైక్‌ల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించనున్నారు. చిన్న వ్యాపార పథకానికి ఆన్‌లైన్‌లో మొత్తం 32 దరఖాస్తులు అందగా, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఇద్దరిని ఎంపిక చేశారు. అలాగే ఈ-స్కూటర్, ఈ-బైక్‌ల కోసం వచ్చిన 28 దరఖాస్తుల నుంచి ఎనిమిది మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కుమారస్వామి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజీవ్ కుమార్, ఎంపీడీవోలు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది, క్రిస్టియన్ కమిటీ అధ్యక్షుడు జీవన్, పాస్టర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన
- ఎస్పీ మహేష్ బి. గితే



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:
విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థినీ, విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను విద్యార్థులకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ విధులు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియతోపాటు బాధితులకు న్యాయం అందించేందుకు పోలీసులు తీసుకునే చర్యలను తెలిపారు .పోలీసులు నిర్వహించే పగలు, రాత్రి గస్తీ, పెట్రోలింగ్ విధానాలను విద్యార్థులకు తెలియజేశారు. నేరస్తులను గుర్తించేందుకు వినియోగించే ముఖ గుర్తింపు వ్యవస్థ, వేలిముద్రల సేకరణ పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. నేరాల నివారణ, నేరాలను త్వరగా ఛేదించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను తెలిపారు.మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలు, విధుల గురించి అవగాహన కల్పించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి, నిరోధించడంలో సీఈఐఆర్ వ్యవస్థ ఉపయోగాన్ని, బాంబు స్క్వాడ్ విధులు, పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసే విధానం, పోలీస్ జాగిలాల సేవలను విద్యార్థులకు తెలియజేశారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అతివేగం, ప్రమాదకర డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఐటీ కోర్, భరోసా కేంద్రం, షీ టీమ్స్, వేలిముద్రల విభాగం, బాంబు స్క్వాడ్, సమాచార ప్రసార విభాగాల సిబ్బంది ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి పోలీస్ శాఖ విధులు, ప్రజల రక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు.ఇక్కడ డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గణేష్, అనిల్, రంజిత్, ఆర్ఎస్ఐ సాయి కిరణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



- 12వ వార్డులో లో ఓల్టేజీ సమస్యకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.
- గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తా.
- సర్పంచ్ కొండ రమేష్ గౌడ్.

ఎల్లారెడ్డి పేట బలగం టీవీ
ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ తెలిపారు. గ్రామంలోని 12వ వార్డులో దీర్ఘకాలంగా నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు వెల్లడించారు.సర్పంచ్‌గా పోటీ చేసిన సమయంలో 12వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న లో ఓల్టేజీ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని రమేష్ గౌడ్ తెలిపారు. తాను గెలిస్తే సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చానని, ఆ హామీ మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

## సబ్‌స్టేషన్ ఏర్పాటే లక్ష్యం.

గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సర్పంచ్ అన్నారు. ఇందుకోసం అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేసే విషయమై గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## బైపాస్ రోడ్డులో విద్యుత్ వెలుగులు.

బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలోని బైపాస్ రోడ్డులో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించడంతో పాటు గ్రామ పంచాయతీ నిధులతో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు రమేష్ గౌడ్ తెలిపారు. దీంతో బైపాస్ రోడ్డులో వెలుగులు నిండాయని పేర్కొన్నారు.అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన నాయకులు, బతుకమ్మ వేడుకల సందర్భంగా విద్యుత్ స్తంభాల తరలింపులో స్వచ్ఛందంగా సహకరించిన యువకులు, విద్యుత్ సిబ్బంది, గ్రామస్థులు, ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవానికి హాజరైన నాయకులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులకు సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

- అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం.
- పోలీసుల విధులు, చట్టాలు, మహిళల రక్షణ, సైబర్ మోసాలపై అవగాహన.



ఎల్లారెడ్డిపేట బలగం టీవీ
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిర్వహించే విధులు, ప్రజల భద్రత కోసం అందిస్తున్న సేవల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ విద్యార్థులకు సాదరంగా స్వాగతం పలికి, పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, వాటి పనితీరు గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరిస్తారు, ఫిర్యాదుల నమోదు ప్రక్రియ ఎలా ఉంటుంది, జనరల్ డైరీ (జీడీ)లో వివరాలను ఎలా నమోదు చేస్తారు, ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను ఏ విధంగా నమోదు చేస్తారు అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదిని చూపించి, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రోజువారీ విధులపై అవగాహన కల్పించారు.

## పోలీస్ పరికరాలపై ప్రత్యక్ష అవగాహన.

శాంతిభద్రతల పరిరక్షణ, విధుల నిర్వహణలో పోలీసులు ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, వాకీటాకీలు, ఇతర సమాచార ప్రసార పరికరాలను విద్యార్థులకు పరిచయం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సిబ్బంది సమాచారాన్ని ఎలా చేరవేసుకుంటారు, విధుల్లో ఉన్నప్పుడు భద్రతా పరికరాలు ఏ విధంగా ఉపయోగపడతాయి అనే విషయాలను వివరించారు.

## ఆపదలో డయల్ 100, 112 సేవలు.

ఆపద సమయాల్లో ప్రజలు పోలీసుల సహాయం పొందేందుకు డయల్ 100, 112 అత్యవసర సేవలను ఎలా వినియోగించుకోవాలో సీఐ వెంకటేష్ వివరించారు. మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేసే షీ టీమ్స్ సేవలు, వేధింపులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

విద్యార్థుల భద్రతకు సంబంధించిన పోక్సో చట్టం, బాల్యవివాహాల నివారణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులు వివరించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు వెల్లడించకూడదని, అనుమానాస్పద లింకులను తెరవకూడదని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఆన్‌లైన్‌లో వేధింపులు లేదా మోసాలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## విద్యార్థుల్లో చట్టాల పట్ల అవగాహన పెంపు.

కార్యక్రమంలో విద్యార్థులు పోలీస్ విధులు, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణకు సంబంధించిన పలు సందేహాలను అడగగా, పోలీస్ అధికారులు వాటికి సమాధానాలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల మనోహర్ చారి, ఉపాధ్యాయులు అజ్మీరా భీక్కు నాయక్ మాట్లాడుతూ.. సమాజంలో పోలీసుల పాత్ర ఎంత కీలకమైనదో విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెరగడంతోపాటు, పోలీసుల పట్ల ఉన్న అపోహలు తొలగి, చట్టాలను గౌరవించే బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించిన పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- భూముల రీ సర్వేను పట్టాదారుల సమక్షంలోనే చేపట్టాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:
భూభారతి దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. భూభారతి దరఖాస్తులు, భూముల రీ సర్వే తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఇప్పటివరకు రీ సర్వే చేపట్టిన గ్రామాలు, సర్వే పురోగతి, మిగిలిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి కింద అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వే నిర్వహించే తేదీ, ఇతర వివరాలను సంబంధిత పట్టాదారులకు ముందుగానే తెలియజేయాలని, వారి సమక్షంలోనే భూముల సర్వే చేపట్టాలని అన్నారు.రీ సర్వే కోసం డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్, గ్రామ పంచాయతీ అధికారి (జీపీఓ)లతో బృందాలను ఏర్పాటు చేసి సమగ్రంగా సర్వే నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే పనులను తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సహకారంతో పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేవీఎస్‌బీ కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, వివిధ మండలాల తహసీల్దార్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# తిప్పాపూర్‌కు రూ.2.70 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

బలగం టీవీ, వేములవాడ:
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని తిప్పాపూర్‌లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి టీజీఎన్‌పీడీసీఎల్ రూ.2 కోట్ల 70 లక్షల 64 వేలతో పరిపాలనా, సాంకేతిక అనుమతులు మంజూరు చేసింది. పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, తరచూ ఎదురవుతున్న విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రతిపాదనతో ఈ సబ్‌స్టేషన్ మంజూరైంది. నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడే అవకాశం ఉంది. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బలగం టీవీ,వేములవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 'సేవా సంకల్ప అభియాన్--డిజిటల్ ఎడ్యుకేషన్, ఏఐ ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తూ, నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు (ఏఐ) నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కంప్యూటర్ విద్య ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు లభిస్తాయని, పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చుని పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచడం ద్వారా వారి ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. విద్యతో పాటు నాణ్యమైన పోషకాహారం




అందించడం కూడా ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణలోనూ నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వేములవాడ నియోజకవర్గానికి కొండ్రాపోలులో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తీసుకువచ్చామని, దీని ద్వారా సుమారు 1,500 మంది విద్యార్థులకు విద్యనందించే అవకాశం కల్పించామని అన్నారు .ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆరుట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకు ఏటా వేలాది రూపాయలు ఫీజుల రూపంలో ఖర్చు చేయాల్సి వస్తుండగా, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో ఆర్థిక భారం తగ్గుతోందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరుట్ల పాఠశాలలో 1,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు పూర్తయి, అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టే పరిస్థితి రావడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు.విద్యతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముచ్చర్ల ప్రాంతంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి, భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.మల్లారం గ్రామ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు

# ఆలయ అభివృద్ధి పనులకు గడువు విధించాలి



- **నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి**
- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,వేములవాడ: శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి పనికి స్పష్టమైన గడువు విధించి, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (వీటీడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దేవాదాయ, మున్సిపల్, రహదారులు--భవనాలు, విద్యుత్, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను వేగవంతం చేసి, అవసరమైన మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.రాజన్న ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ వంతెన వరకు చేపడుతున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రహదారి పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ టవర్ల మార్పు తదితర పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు.గుడిచెరువు కట్ట పార్కులో మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణతో పాటు సందర్శకులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా నాయక్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్అండ్‌బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వీటీడీఏ, పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు రుణాలను వ్యాపారాభివృద్ధికి వినియోగించుకోవాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల : బ్యాంకుల ద్వారా పొందే రుణాలను వ్యాపారాభివృద్ధికి సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని చేనేత, పవర్ లూమ్ రంగాల యజమానులు, ఆసాములు, కార్మికులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'ఎంఎస్ఎంఈ సంవాద్' కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమం ద్వారా వస్త్ర పరిశ్రమకు చెందిన యజమానులు, ఆసాములు, కార్మికులకు సంస్థాగత రుణాలపై అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవడం, ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రక్రియలను జోడించడం ద్వారా ఆదాయం, ఉపాధి అవకాశాలను పెంపొందించుకునే మార్గాలను వివరించారు.ఈ సందర్భంగా ఆర్బీఐ ఎల్‌డీఓ చేతన్ మాట్లాడుతూ.. సంస్థాగత రుణాల ప్రాధాన్యత, బ్యాంకుల ద్వారా లభించే రుణ సదుపాయాలు, ఆర్థిక క్రమశిక్షణ, రుణాల సక్రమ వినియోగంపై అవగాహన కల్పించారు. వివిధ మార్గాల్లో రుణాలు తీసుకోవడం వల్ల వీవర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను వివరించారు. అనధికారిక రుణాలపై ఆధారపడకుండా బ్యాంకులను సంప్రదించి, తమ అవసరాలకు అనుగుణంగా రుణాలు పొందాలని సూచించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన యజమానులు, ఆసాములు, కార్మికులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఆర్థికంగా ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, ఆకర్షణీయమైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. తద్వారా ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు ఆదాయం పెరిగి, ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆర్డర్లకే పరిమితం కాకుండా ప్రైవేటు సంస్థల ఆర్డర్లను సైతం స్వీకరించి, వాటికి అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేసే స్థాయికి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎదగాలని ఆకాంక్షించారు. చేనేత వస్త్రాల తయారీపై మరింత దృష్టి సారిస్తూ, మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలో మార్పులు తీసుకురావాలని సూచించారు. నాణ్యత, కొత్తదనంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, ఎల్‌డీఎం రాజీవ్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, చేనేత, జౌళి శాఖ ఏడీ సంతోష్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, చేనేత, పవర్‌లూమ్ యూనిట్ యజమానులు, వీవర్లు తదితరులు పాల్గొన్నారు.

# వల్లంపట్ల లో విద్యుత్ వైర్ స్టార్టర్ ఎత్తుకెళ్లిన దుండగులు

బలగం, టీవీ ఇల్లంతకుంట



ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామంలో రైతు పందిల్ల సురేష్ కు చెందిన వ్యవసాయ బావి వద్ద అర్ధరాత్రి సమయం లో దాదాపు ఇరవై ఐదు గజాల విద్యుత్ వైర్, స్టార్టర్, ఫ్యూజులు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైతు సురేష్ తెలిపారు.దాదాపు పది వేల విలువ గల వస్తువులను దొంగలించినట్టు రైతు ఆవేదన వ్యక్తం చేసారు. దొంగలను పట్టుకొని తనకు న్యాయం చేయాలనీ రైతు కోరారు.

# రోడ్డు సమస్యపై అధికారులపై సర్పంచుల ఆగ్రహం!



- **ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల జాప్యంపై నిలదీత..**
- **ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో వాడీవేడిగా సర్వసభ్య సమావేశం**

ఎల్లారెడ్డిపేట బలగం టీవీ

ఎల్లారెడ్డిపేట మండలంలో నెలకొన్న రోడ్డు సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర అంశాలపై పలువురు సర్పంచులు అధికారులను నిలదీశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు తగిన చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి.. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ గ్రామాల సమస్యలు ప్రస్తావనకు రావడంతో సమావేశం వాడీవేడిగా సాగింది.

## బండ లింగంపల్లి నుంచి నారాయణపూర్ వరకు రోడ్డు అధ్వానం

బండ లింగంపల్లి నుంచి నారాయణపూర్ వరకు రహదారి సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బండ లింగంపల్లి సర్పంచ్ నర్సా గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉండటంతో ప్రజలు ప్రయాణాల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని, అత్యవసర పనులపై వెళ్లేవారికి కూడా సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.రోడ్డు బాగాలేకపోవడంతో ముస్తాబాద్ మండలం కొండాపూర్ మీదుగా నారాయణపూర్ ఎల్లారెడ్డిపేట కు రావాల్సి వస్తోందని పేర్కొంటూ, ప్రజలకు ఇంతటి అసౌకర్యం కలుగుతున్నా సమస్య పరిష్కారానికి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు సరిగా లేకపోతే ప్రజల రాకపోకలతో పాటు నిత్యావసర పనులు, అత్యవసర ప్రయాణాలపైనా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల బిల్లులపై సర్పంచుల అసంతృప్తి

సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, చెల్లింపుల ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను పలువురు సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బిల్లుల జాప్యం వల్ల లబ్ధిదారులు లక్షలు అప్పులు చేసి ఇల్లు కట్టుకొని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచులు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని కోరారు.

## సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్

మండల సర్వసభ్య సమావేశం ప్రజా సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన వేదిక అని, అలాంటి సమావేశాల్లో గ్రామాల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ప్రతిసారి సమావేశం నిర్వహిస్తున్నారు కానీ సమస్యలు అలాగే ఉంటున్నాయని పలువురు సర్పంచులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

## బండలింగంపల్లి గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారు

బండలింగంపల్లి గ్రామంలో ఆరోగ్య కేంద్రాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని మండల వైద్యాధికారి సరియా ను సర్పంచ్ నర్సా గౌడ్ ప్రశ్నించారు. పనులు పూర్తయినప్పటికీ పనులు పూర్తికాలేవు అని మండల వైద్యాధికారి అనడంతో మీరు ఎప్పుడు చూశారు ఏఈ ని అడగండి అని అన్నారు. పనులు పూర్తి అయ్యాయని ఏఈ చెప్పడంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని మండల వైద్యాధికారి అన్నారు.

## విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్న ఏఈని అభినందించిన అధికారులు సర్పంచులు

వివిధ గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరిస్తున్న ఏఈని పలువురు అధికారులు అన్ని గ్రామాల సర్పంచ్లు అభినందించారు. గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తున్నాడని ఏఈ ని సర్పంచ్ సుభాష్, రమేష్ గౌడ్, నరస గౌడ్, నరసయ్య, తిరుపతి, తదితరులు అభినందించారు.గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు త్వరితగతిన పరిష్కారం లభించేలా సంబంధిత శాఖల అధికారులు స్పందించాలని సర్పంచులు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో, రోడ్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు ఎప్పుడు ఉపశమనం లభిస్తుందో వేచి చూడాల్సి ఉంది.ఈ సర్వసభ్య సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సబ్జల్ బేగం, ఎంపీడీవో సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం, ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు దొమ్మాటి నరసయ్య, అందే సుభాష్, కొండ రమేష్ గౌడ్, నర్సాగౌడ్, ఎనగందుల నరసింహులు, తిరుపతి నాయక్, సిర్రం నాగరాజు, మామిండ్ల కిషన్, ఇల్లందుల గీతాంజలి, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.